10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 3 ఫిబ్రవరి 2025 | పేజీలు 8




2013లో సిడిపి నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకుకి శంకుస్థాపన చేసిన శిలాఫలకం..

సిడిపి నిధుల దుర్వినియోగం పార్ట్-1

# ట్యాంకు కట్టారు..! నిరుపయోగంగా పెట్టారు..!

## నేతల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం..! వెరసి పన్నెండేళ్ళు గడిచాయి..!

**మాధవ్ పత్తి..**
**మేడ్చల్ జిల్లా బ్యూరో,**
**పెన్ పవర్, ఫిబ్రవరి 2:**

నియోజకవర్గం అభివృద్ధి నిధులు (సిడిపి,ఎస్‌డిఎఫ్) దుర్వినియోగ పరచడంలో కుత్బుల్లాపూర్ నాటి నుండి నేటివరకు మొదటి స్థానంలోనే ఉన్నట్టు స్పష్టమవుతుంది.. గాజులరామారం “ఓవర్ హెడ్ ట్యాంక్” 2013లో నిర్మించి గత 12 ఏళ్ళుగా నిరుపయోగంగా ఉండటం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.. ఎమ్మెల్యే ఎవరైనా నియోజకవర్గం అభివృద్ధి నిధుల దుర్వినియోగం కామన్ అయిపోయింది.. సిడిపి నిధుల వినియోగానికి అర్థాన్ని కూడా మార్చేస్తున్నారు.. ఈ వ్యవహారంలో నేతలు, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు ఒక్కటై చేతివాటాన్ని ప్రదర్శిస్తుంటే సంబంధిత జిల్లా కలెక్టర్‌లు కూడా చోద్యం చూస్తున్నారు.. 2022 జనవరిలో నియోజకవర్గంలోని డి.పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో (తహశీల్దార్ కార్యాలయం ఎదుట) కబ్జాదారుల కోసం, నిర్జన ప్రదేశంలో, వేరేచోట వేయాల్సిన సీసీరోడ్డును రూ.10 లక్షల “సిడిపి” నిధులతో సీసీరోడ్డు నిర్మించారు.. 2024 ఆగష్టు నెలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్‌పల్లి సర్వే నెంబర్ 227 ప్రభుత్వ భూమిలో రూ.60 లక్షలు కేటాయించి కమ్మ సేవాసమితి ఫంక్షన్ హాల్ వరకు కబ్జాదారుల కోసం సర్కారు భూమిలో సీసీరోడ్డు నిర్మాణం కలెక్టర్ పర్యవేక్షణలో..? నిర్మాణం చేపట్టడం విశేషం.. తాము అధికారులుగా ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అహం ఒకవైపు.! మరోవైపు “సిడిపి” నిధులకు అర్థం తెలియని ఎమ్మెల్యేలు, ప్రజల డబ్బును దుర్వినియోగ పరుస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి..



గత 12 ఏళ్ళుగా నిరుపయోగంగా గాజులరామారం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు..



ట్యాంకుపై సిడిపి నిధులు, ట్యాంకు సామర్థ్యం 60 వేల లీటర్‌లు అని రాసిఉన్నది చూడవచ్చు..

- కుత్బుల్లాపూర్ గాజులరామారం గ్రామంలో “సిడిపి” నిధులు దుర్వినియోగం..
- 60 వేల లీటర్‌ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకు ను “సిడిపి” నిధులతో 2013లో నిర్మాణం..
- రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ వాటర్ ట్యాంక్..12 ఏళ్ళుగా నిరుపయోగం..
- నేతలకి శంకుస్థాపనలపై ఉన్న మోజు..! వినియోగంలోకి తేవడంలో లేకపోవడం బాధాకరం..
- కాంట్రాక్టర్‌లకి పనులు కల్పించడంలో చూపిన ప్రాధాన్యత.. ట్యాంక్ వాడుకలోకి తెస్తే బాగుండేది..
- కుత్బుల్లాపూర్ “నియోజకవర్గం అభివృద్ధి నిధులు” నాటినుండి నేటి వరకు “సిడిపి” నిధులు వృథా..
- గతంలో 2013 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ ట్యాంక్ నిర్మాణం..
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంది.. ఇప్పుడైనా ట్యాంకు వినియోగంలోకి వస్తుందా..?

అధికారులు, నేతల అనాలోచిత నిర్ణయాలతో..! మంజూరు చేసిన “నియోజకవర్గం అభివృద్ధి నిధులు” అన్యాక్రాంతం అవుతున్నాయి.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం గ్రామంలో 2013లో అప్పటి ఎమ్మెల్యే కూనా శ్రీశైలంగౌడ్ ‘సిడిపి’ నిధులు రూ.10 లక్షల అంచనా వ్యయంతో “ఓవర్ హెడ్ ట్యాంక్‌కి” 2013 ఆగష్టు 23న శంకుస్థాపన చేశారు.. వెంటనే ట్యాంకు నిర్మాణం కూడా పూర్తి చేశారు.. అధికారులు కూడా ట్యాంకుపై రాతలు, అట్టహాసంగా ట్యాంకులోకి నీళ్ళు నింపడానికి, గ్రామంలో వీధి వీధికి నీటిసరఫరా కోసం హెచ్‌డి పైపులైన్‌లు కూడా విస్తరింప జేశారు.. ఇంతవరకు భాగానే ఉంది.. నాటి ఎమ్మెల్యే బాధ్యతతో నిధులు సాంక్షన్ చేసినప్పటికీ..! అధికారులు బాధ్యతా రహితంగా వ్యవహరించారు.. నిర్మాణం పూర్తైన ట్యాంకును గత 12 ఏళ్ళుగా నిరుపయోగంగా ఉంచడమే అందుకు నిదర్శనం.. ప్రస్తుతం గాజులరామారం ఓవర్ హెడ్ ట్యాంక్ అలంకార ప్రాయంగా మిగిలిపోయింది.. అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం వృథా చేస్తున్నారని గ్రామస్థులు ఆవేద చెందుతున్నారు.. గాజులరామారంలోని వాటర్ ట్యాంకు నిర్మాణం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారని..! ప్రస్తుతం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున..! ఇప్పటికైనా ఓవర్ హెడ్ ట్యాంకుని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు..

# కోడ్ పేరిట పథకాలను ఆపే కుట్ర



## వాటిని అమలు చేశాకే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలి: హరీశ్‌రావు

హైదరాబాద్ పెన్ పవర్: “ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోడ్ పేరుతో సంక్షేమ పథకాలను ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. హామీ ఇచ్చిన పథకాలన్నీ అమలు చేశాకే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి” అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఇప్పటికే కాంగ్రెస్‌కు ఒకసారి ఓట్లేసి మోసపోయారని, మళ్లీ అలాంటి పొరపాటు చేయరాదని ప్రజలకు సూచించారు. ఆదివారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌లో రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు

-3లో

# 2028లో బీసీ సీఎం ఖాయం

హైదరాబాద్ పెన్ పవర్: “తెలంగాణ రాష్ట్రానికి బీసీలే ఓనర్లు. వరంగల్ వేదికగా చెబుతున్నా.. మా ఓట్లతో మేం గద్దెనెక్కుతాం.. మీరు దిగిపొండి.. 2028 ఎన్నికల్లో ఈ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి ఖాయం. తెలంగాణకు చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే” అని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించారు. హనుమకొండ

-3లో



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

## చిరకాల మిత్రుల అపూర్వ కలయికతో ఆనంద భాష్పాలు..!







కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు..

- జీడిమెట్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007 పదవ తరగతి బ్యాచ్..
- పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు హాజరైన ఉపాధ్యాయులు..
- కొన్నేళ్ళ తర్వాత గురు శిష్యుల కలయికతో ఉద్వేగభరితమైన సన్నివేశాలు..
- నాటి స్మృతులు, పాఠశాల తీపి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలు, నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు..
- ఉపాధ్యాయులు సరస్వతి పూజ, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 2:** కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007 బ్యాచ్ కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు.. పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు వారికి విద్యాబుద్దులు నేర్పించిన ఉపాధ్యాయులు హాజరయ్యారు.. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన సరస్వతి పూజలో పాల్గొన్న గురు శిష్యులు పాల్గొన్నారు.. అనంతరం ఉపాధ్యాయులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.. పూర్వ విద్యార్థులంతా కొన్ని సంవత్సరాల విరామం తర్వాత ఒకచోటకు చేరిన ఆక్షణాలు ఉద్వేగభరితంగా మారాయి.. తమ పాఠశాల రోజులను, అలనాటి తీపి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు నెమరు వేసుకున్నారు.. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని. తమ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పిల్లాపాపలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. పదో తరగతి పాసై 18 సంవత్సరాలు గడిచిన సందర్భంగా, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని, విద్యార్థులంతా ఇలా కలుసుకోవడం వల్ల స్నేహాలు బలపడతాయని ఉపాధ్యాయులు ఉపోద్ఘాతం పలికారు..




### గురువులకు శిష్యుల సన్మానం..

అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులంతా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలనాటి ఉపాధ్యాయులు మాజీ ప్రధానోపాధ్యాయుడు శంకర్ రెడ్డి, రామచంద్రం, గోపాలకృష్ణ, ఆశ రాణి,మోహన్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ వద్ద పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ జీవితంలో స్థిరపడడం అభినందనీయం అన్నారు.. ఏళ్లు గడిచినా తమను గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించడం సంతోషంగా ఉందని, జీవితంలో మరిచిపోలేని రోజుగా గుర్తుండి పోతుందన్నారు..ఈ కార్యక్రమంలో 2006-2007 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు..







# బీసీలు ఉద్యమ పంథా మార్చాలి.. హన్మకొండ బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో ఆర్ కృష్ణయ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** బీసీలు ఉద్యమ పంథా మార్చాలని హన్మకొండ బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమ నేత ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఢిల్లీలో రైతులు చేసిన ఉద్యమం తరహాలో, ఏపీలో కాపు ఉద్యమంలా పంథా మార్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసినట్టే బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలని, అప్పుడే ప్రభుత్వాలు దిగొస్తాయని.. ప్రతీ ఒక్కరూ తెగించి పోరాడాలని బీసీలకు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు.ఐబీసీలకు న్యాయం జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలని, తెలంగాణలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. బీసీ కులాలన్నీ రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని, ఇప్పటి వరకూ బీసీలకు ముఖ్యమంత్రి పదవి రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు బీసీ నాయకులకు ముఖ్యమంత్రి పదవి చేపట్టే అవకాశం వచ్చినా... రానివ్వకుండా అణగతొక్కారని ఆయన చెప్పుకొచ్చారు. బీసీలు ఆర్థిక ప్రగతి సాధించాలంటే బీసీ నాయకుడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. బీసీ బంధు పథకం పెట్టి, ప్రతీ బీసీ కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

## మందుబాబులకు బంపరాఫర్: బాటిల్ కొంటే ..
# థాయ్‌లాండ్ టూర్ ఉచితం






**హైదరాబాద్ పెన్ పవర్:**వ్యాపారస్తులు బిజినెస్‌ను పెంచుకొనేందుకు.. కష్టమర్లను ఆకట్టుకునేందుకు అనేక ట్రిక్కులను ఉపయోగిస్తారు. ఒకటి కొంటే మరొకటి ఫ్రీ.. గిఫ్ట్ కూపన్స్.. డిస్కౌంట్ ఆఫర్స్.. లాటరీ ద్వారా బహుమతులు ఇలా ఒకటేమిటి అనేకమైనవి వింటున్నాం.. చూస్తున్నాం. అయితే తాజాగా ఇప్పుడు ఓ మద్యం వ్యాపారి ఆ షాపులో చుక్క తాగకుండానే కిక్కు ఎక్కే ఆఫర్‌ప్రకటించాడు. కాకినాడకు చెందిన ఓ లిక్కర్ షాపు యజమాని మందు తాగండి .. థాయ్‌లాండ్ వెళ్లండి అంటూ పోటీలు ఏర్పాటు చేశాడు. తన దుకాణంలో అన్నిరకాల బ్రాండ్లు దొరుకుతాయంటూ.. మద్యం కొన్న వారికి టోకెన్లు ఇస్తామని ప్రకటించారు. కావలసిన బ్రాండ్ ను ఫుల్లుగా తాగడమే కాదు ఫ్రీగా.. థాయ్‌లాండ్ వెళ్లే అదృష్టాన్ని పరీక్షించుకోండి అంటూ ప్రకటించాడు.మద్యం ప్రియులు తమ షాపులో బాటిల్ కొంటే.. టోకెన్ ఇస్తామని... లాటరీ లో గెలుపొందిన వారికి కారు, బైక్, సెల్ ఫోన్ వంటి గిఫ్ట్‌లను రూ. 1.5 లక్షల విలువైన బహుమతులు ఉన్నాయి. అంతే కాదు లాటరీ లో మొదటి బహుమతి గెలుపొందిన వారు ఏకంగా థాయ్‌లాండ్ వెళ్లొచ్చు అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది.ఈ ప్రకటన చూసిన మందుబాబులు కాకినాడలోని ఆషాపునకు క్యూ కట్టారు. మరి థాయ్‌లాండ్‌ఫ్రీ టూర్ అదృష్టం ఎవరిని వరించనుందో చూడాలి.

# 2028లో బీసీ సీఎం ఖాయం

- మొదటి పేజి తరువాయి

ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 'బీసీ రాజకీయ యుద్ధభేరి' సభకు ముఖ్య అతిథిగా హాజరైన మల్లన్న ఆవేశంగా ప్రసంగించారు. 'తెలంగాణలో పిడికెడు మంది లేని ఓసీ వర్గాల నుంచి 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాష్ట్రంలోని 2 కోట్ల మంది బీసీలు.. ఏటా రూ. 1.20 లక్షల కోట్ల సంపాదనను రాష్ట్ర ఖజానాకు జమ చేస్తున్నారు. కానీ బీసీలకు ప్రభుత్వం బడ్జెట్లో రూ.9 వేల కోట్లు మాత్రమే విదిలిస్తోంది. బీ ఫారం ఇవ్వనివారికి, బీసీలకు మధ్య ఇకపై యుద్ధమే. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేస్తారా? మీ ప్రభుత్వాన్ని రద్దు చేయాలా? ముస్లింలకూ అన్యాయం జరుగుతోంది. 539 జడ్పీటీసీల్లో ఒక్కరే ముస్లిం ఉన్నారు' అని మల్లన్న పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల్లో అనేక కులాలున్నా, మనది బీసీ కులం అన్నారు. అందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

తీన్మార్ మల్లన్నను బీసీ మిలిటెంట్గా అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించకపోతే రాష్ట్రాన్ని రణరంగం చేయాలని పిలుపునిచ్చారు. సభలో డీఎంకే ఎంపీ విల్సన్, నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, పలువురు బీసీ సంఘ నేతలు పాల్గొన్నారు.

# కోడ్ పేరిట పథకాలను ఆపే కుట్ర

- మొదటి పేజి తరువాయి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో హరీశ్ మాట్లాడుతూ... "రేవంత్‌రెడ్డి చెప్పే మాయమాటలు నమ్మరాదు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం మాట తప్పారు. రైతుభరోసా డబ్బులు ఖాతాల్లో పడతాయని జనవరి 26న అన్నదాతలు రాత్రంతా ఎదురుచూసినా సెల్‌ఫోన్లలో టకీటకీ శబ్దమేదీ రాలేదు. కేసీఆర్ పదేళ్లలో తెలంగాణ గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేశారు. వివిధ రకాల వృత్తులను ప్రోత్సహించారు. కాంగ్రెస్ మాత్రం ఉన్న పథకాలను పూర్తిగా బంద్ చేసింది. వారి మోసాలను గుర్తించి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు.

## సాగు, ఇతర రంగాలపైనా
# దృష్టిసారించాలి
## అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత అవసరం
## ఎకనమిక్ వీక్లీ ఎడిటర్ ఎస్.మహేంద్రదేవ్



**హైదరాబాద్ పెన్ పవర్:**'దేశంలో వ్యవసాయం ప్రాధాన్యం పెరుగుతోంది.. ఎక్కువ మంది దీనిమీద ఆధారపడుతున్నారు.. వాతావరణ మార్పులు వంటివి సాగుపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నందున దీంతోపాటు ఇతర రంగాలపైనా దృష్టిసారించాలి' అని ఎకనమిక్ వీక్లీ ఎడిటర్ ఎస్.మహేంద్రదేవ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఆస్కీ)లో కేంద్ర బడ్జెట్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. అభివృద్ధి చెందిన చైనా, అమెరికా దేశాలు ఇంధనం, ఏఐ, బయోటెక్ రంగాలపై దృష్టిసారిస్తున్నాయని.. మనమూ ఆయా రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంక్షేమ ఫలితాలు స్వల్పకాలికంగా ఉంటాయని మౌలిక సదుపాయాలు దీర్ఘకాలంగా ఉంటాయని చెప్పారు. లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ దేశంలో విద్య, వైద్య రంగాల్లో మౌలిక మార్పులు అవసరమన్నారు. విద్యారంగంలో ఖర్చుకు తగిన ఫలితాలు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పన్నుల విధానం ఆశాజనకంగానే ఉందని, అయితే దీనితో దేశమంతా ముందుకుపోతుందని భావించలేమని చెప్పారు. సమావేశంలో ఆస్కీ డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అతిథులను సత్కరించారు.

# రథసప్తమి విశిష్టత .. ప్రాముఖ్యత ఇదే.. ఆరోజు ఏంచేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**హిందువులు పండుగలకు .. పర్వ దినాలకు చాలా ప్రాముఖ్యత ఇస్తారు. మాఘమాసం కొనసాగుతుంది. లోకానికి వెలుగును ప్రసాదించే సూర్య భగవానుడి పుట్టిన రోజు మాఘమాసం శుక్ల పక్షం సప్తమి తిథి రోజున సూర్యభగవానుడు జన్మించాడని మన శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ ఏడాది రథసప్తమి ఫిబ్రవరి 4 వ తేదీన వచ్చింది. రథసప్తమి రోజున పూజ ఎలా చేయాలి ? ఎందుకు చేయాలి ? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. సకల జగత్తుకి వెలుగునిచ్చే సూర్యుడు రథాన్ని ఎక్కి తన దిశ... నిర్దేశాన్ని మార్చుకునే రోజు రథసప్తమి . అలాంటి సమయంలో చెయ్యాల్సిన కొన్ని పనులు చెయ్యటం వల్ల ఆరోగ్యం వృద్ధి చెందటమే కాదు దీర్ఘకాలిక వ్యాధుల నుండి కూడా ఉపశమనం లభిస్తుందని పురాణాల ద్వారా తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం, బ్రహ్మ ముహూర్తపు శుభ సమయంలో స్నానం చేయడం, సూర్య భగవానుడికి అర్ఘ్యం సమర్పించడం వల్ల పాపాలు విముక్తమవుతాయని, తీవ్రమైన అనారోగ్యాలు తొలగిపోతాయని నమ్ముతారు.


రథసప్తమి రోజున సూర్యభగవానుడిని స్మరించుకుంటారు. దీనిని సూర్య జయంతి అని



కూడా అంటారు. సూర్య భగవానుడు ప్రత్యక్షమై తన బంగారు రథాన్ని అధిరోహించాడని నమ్ముతారు. రథ సప్తమి కథలోకి వస్తే...సూర్య దేవుడు, కశ్యప మహర్షి, అతని భార్య అదితికి జన్మించాడు. సూర్యుడు అన్ని జీవులకు ప్రాణ ప్రదాత. సూర్యుడు ఒక సంవత్సరంలో ప్రతి 12 రాశుల గుండ పూర్తి ప్రయాణాన్ని పూర్తి చేస్తాడు.పూర్వకాలంలో చాలామంది ఉదయం సూర్య దేవుడిని పూజిస్తారు. స్నానం చేసిన తరువాత సూర్య నమస్కారాలు చేస్తారు. రథ సప్తమి రోజుఉదయాన్నే లేచి పూజలు నిర్వహిస్తే తప్పకుండా ఆరోగ్యం సిద్ధించడంతో పాటు ఉద్యోగ, వ్యాపారాల్లో పురోగతి సాధిస్తారని పండితులు అంటున్నారు.

రథ సప్తమి ( ఫిబ్రవరి 4) నాడు సూర్య స్నానాలు చేయాలి. అంటే సమీపంలోని నది లేదా సముద్రంలో స్నానం చేసి సూర్య భగవానుడిని పూజించాలి. భక్తితో సూర్యుడిని పూజించడం వల్ల జీవితంలోని సమస్యలు అన్ని కూడా తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. సూర్యుని భక్తితో ఒక నియమం ప్రకారం పూజించాలి. అప్పుడే చేసిన పూజకి ఫలితం ఉంటుంది. రథసప్తమి రోజున బ్రహ్మ ముహూర్తంలో ఏదైనా నది లేదా సముద్ర స్నానం చేయాలి. లేదంటే ఇంట్లోనే స్నానం ఆచరించాలి. పసుపు రంగు దుస్తులు ధరించి సూర్య దేవుడిని పూజించాలి. ముందుగా రాగితో అర్ఘ్యం సమర్పించాలి. ఆ తర్వాత సూర్య దేవుని ఆరాధించి.. సూర్య మంత్రం, సూర్య చాలీసా పఠించాలి. ఆ తర్వాత సూర్యదేవునికి హారతి ఇవ్వాలి. దీంతో పాటు నీరు, వివిధ రకాలు అన్ని కూడా సూర్యునికి సమర్పిస్తారు. ఇలా పూజ చేయడం వల్ల మంచి ఫలితాలు లభిస్తాయి. సంతోషం, శ్రేయస్సు, మంచి ఆరోగ్యం లభిస్తాయని భక్తులు నమ్ముతారు. రథసప్తమి రోజున సూర్యదేవుడిని పూజించడం వల్ల సకల సౌఖ్యాలు కలుగుతాయి. అలాగే శారీరక, మానసిక బాధల నుంచి కూడా ఉపశమనం పొందుతారు.

# కిమ్స్‌లో ఇంకెన్నాళ్లు ఇలా..? శ్రీతేజ్‌ను కాపాడుకునేందుకు అల్లు అర్జున్ బిగ్ డెసిషన్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీతేజ్‌కు మరింత మెరుగైన వైద్యం అందించడానికి విదేశాలకు తీసుకెళ్లాలని అల్లు అర్జున్ డిసైడ్ అయినట్టు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లో శ్రీతేజ్‌ను ప్రాణాపాయం నుంచి బయటపడేయాలని, శ్రీతేజ్‌ను కాపాడుకోవాలని బన్నీ డిసైడ్ అయినట్లు సమాచారం. సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను ఆదివారం నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్యం కుదుటపడటంతో బన్నీ వాసు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీతేజ్‌కు మరింత మెరుగైన వైద్యం అందించడానికి ఫారెన్ తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులను గుర్తించడం లేదని, పలకరిస్తే ప్రతి స్పందన చూపించడం లేదని కిమ్స్ వైద్యులు ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే.

శ్రీతేజ్ ఆసుపత్రి పాలై ఇప్పటికే దాదాపు రెండు నెలలయింది. కిమ్స్ హాస్పిటల్ వంటి ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఎంత ఖర్చయినా చూసుకుంటామని అల్లు అర్జున్ ప్రకటించాడు. అయినప్పటికీ ఇప్పటికీ శ్రీతేజ్ పూర్తి స్థాయిలో కోలుకోలేదు. దీంతో.. విదేశాలకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించడమే మేలనే అభిప్రాయానికి అల్లు అర్జున్ వచ్చినట్లు తెలిసింది. డిసెంబర్ 4, 2024న పుష్ప2 బెనిఫిట్‌షో రాత్రి 9.30 గంటలకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు పర్మిషన్ ఇవ్వకున్నా అల్లు అర్జున్ హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోనిసంధ్య థియేటర్‌కు వెళ్లగా.. అక్కడ తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోయింది. ఆమె తొమ్మిదేండ్ల కొడుకు శ్రీతేజ్‌కోమాలోకి వెళ్లాడు. బ్రెయిన్‌కు తీవ్ర గాయం కావడంతో అప్పటి నుంచి కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అసెంబ్లీ వేదికగా అల్లు అర్జున్ తీరును సీఎం రేవంత్ తప్పుపట్టారు.దీనికి తోడు చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను విచారణకు పిలిచి.. ఆధారాలను ముందు పెట్టి ప్రశ్నించడంతో ఆయన తన తప్పును ఒప్పుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో అర్జున్ తండ్రి అల్లు అరవింద్, చిత్ర నిర్మాతలు శ్రీతేజ్‌దగ్గరికి వెళ్లారు. దర్శకుడు సుకుమార్, అతని భార్య కూడా శ్రీతేజ్‌ను పరామర్శించారు. దిల్ రాజు పరామర్శించారు. రేవతి కుటుంబానికి సాయంగా రూ.2 కోట్ల చెక్కును అందజేశారు.సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌ను డిసెంబర్ 13న అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించింది. అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించి.. మధ్యంతర బెయిల్‌పై మరుసటిరోజు (14న) చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. బయటకు వచ్చిన తర్వాత అల్లు అర్జున్‌కు ఇండస్ట్రీ ప్రముఖులు క్యూ కట్టి సంఘీభావం ప్రకటించారు. కానీ, రేవతి కుమారుడు శ్రీతేజ్ పరిస్థితి తెలుసుకునేందుకు ఆవైపు పెద్దగా ఎవరూ వెళ్లకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డి... యూట్యూబ్ వీడియోలే గురువులు!



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పోలీసులు గత రాత్రి గచ్చిబౌలిలోని ప్రిజమ్ పబ్ వద్ద ఘరానా నేరస్తుడు బత్తుల ప్రభాకర్ ను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. పబ్ వద్దకు ప్రభాకర్ వచ్చాడన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన పోలీసులపై... ప్రభాకర్ రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. అనంతరం అతడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి నుంచి రెండు తుపాకులు, 23 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన డీసీపీ వినీత్ మీడియాకు వివరాలు తెలిపారు. బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డి చిత్తూరు జిల్లాకు చెందినవాడు అని వెల్లడించారు. అతడిపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 80 వరకు కేసులు ఉన్నాయని... పలు కేసుల్లో అతడు మోస్ట్ వాంటెడ్ గా ఉన్నాడని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ అతడు నేరాలకు పాల్పడిన చరిత్ర ఉందని డీసీపీ వివరించారు. పోలీసులకు దొరక్కుండా తప్పించుకోవడం ఎలా అనేది యూట్యూబ్ వీడియోలు చేసి నేర్చుకునేవాడని తెలిపారు. "ఇప్పటిదాకా బత్తుల ప్రభాకర్ 66 కేసుల్లో అరెస్ట్ అయ్యాడు. 2022లో అనకాపల్లి కోర్టుకు తీసుకెళుతున్న సమయంలో తప్పించుకుని పారిపోయాడు. అప్పటినుంచి అతడు దొరకలేదు. గతరాత్రి గచ్చిబౌలిలోని ప్రిజమ్ పబ్ వద్ద అతడ్ని పట్టుకున్నాం. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్ పై కాల్పులు జరపడంతో, ఆ కానిస్టేబుల్ కాలికి గాయమైంది" అని డీసీపీ చెప్పారు.

ప్రభాకర్ ను అదుపులోకి తీసుకుని విచారించామని, అతడిచ్చిన సమాచారంతో అతడి నివాసంలో సోదాలు జరిపి

428 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గతంలో జైల్లో ఉన్న సమయంలో తనతో గొడవపడిన తోటి ఖైదీని చంపడానికి బత్తుల ప్రభాకర్ బీహార్ లో తుపాకీ కొనుగోలు చేశాడని డీసీపీ వినీత్ వెల్లడించారు.

ఇక, నివాస గృహాల్లో దొంగతనాలు చేయడం వల్ల దొరికిపోయే అవకాశం ఉంటుందని భావించేవాడని... అందుకే ఊరి బయట ఉండే విద్యాసంస్థల్లో ఎక్కువగా చోరీలకు పాల్పడేవాడని వివరించారు. అతడు 2013 నుంచి నేరాల బాటపట్టాడని, చోరీకి వచ్చే ముందు తప్పనిసరిగా రెక్కీ చేసేవాడని తెలిపారు.

# భూమి దిశగా దూసుకువస్తున్న ఫుట్ బాల్ మైదానం కంటే పెద్ద ఆస్టరాయిడ్.. నాసా ఏం చెబుతోందంటే...!



**హైదరాబాద్ పెన్ పవర్:**భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలాలు ఎప్పటికప్పుడు ప్రపంచాన్ని భయపెడుతూనే ఉన్నాయి. తాజాగా, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) శాస్త్రవేత్తలు 2024 వైఆర్ 4 అనే గ్రహశకలాన్ని కనుగొన్నారు. ఇది 2032లో భూమిని ఢీకొనే అవకాశం ఉందని నాసా శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అబుదాబిలోని ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ సెంటర్ (ఐఏసీ) తెలిపిన వివరాల ప్రకారం.. ఈ భారీ గ్రహశకలం భూమివైపు దూసుకువస్తోందని, దీని పరిమాణం సుమారు ఫుట్‌బాల్ మైదానం కంటే పెద్దగా ఉంటుందని తెలిపారు. ఇది భూమి వైపు చాలా వేగంగా వస్తోందని, భూమిని ఢీకొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, 2032లో భూమిని ఢీకొట్టవచ్చని అంచనా వేశారు.

130 %-% 300 అడుగుల పొడవు గల ఈ గ్రహశకలం మానవాళి మొత్తానికి తక్కువ ప్రమాదకారి అయినా ఒక పెద్ద నగరాన్ని తీవ్రంగా నాశనం చేయగల శక్తిని కలిగి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రభావం 8 మెగా టన్నుల టీఎన్‌టీకి సమానమని, ఇది హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కన్నా 500 రెట్లు శక్తివంతమైనది అయి ఉండవచ్చని వారు వెల్లడించారు.

అయితే, 2032 డిసెంబర్ 22న ఈ గ్రహశకలం భూమిని ఢీకొట్టే అవకాశం ఒక్క శాతమేనని, అంటే 99 శాతం దాని ప్రభావం భూమిపై ఉండదని వారు తెలిపారు. కాగా, ఈ గ్రహశకలాన్ని 2024 డిసెంబర్ 27న నాసాకు చెందిన ఆస్టరాయిడ్ టెర్రెస్ట్రియల్ ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్ కనిపెట్టింది.

# ఎమ్మెల్యేల రహస్య భేటీపై అనిరుధ్ రెడ్డి ఏమన్నారంటే..?

## సమావేశం నిజమే కానీ రహస్యం అంటూ ఏమీలేదని వివరణ
## నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించుకున్నామని వెల్లడి
## పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జిని కలుస్తామని చెప్పిన ఎమ్మెల్యే



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పదిమంది రహస్యంగా సమావేశమయ్యారనే వార్త శనివారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సమావేశానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వం వహించారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. 'ఎమ్మెల్యేలం సమావేశమైన మాట వాస్తవమే కానీ అందులో రహస్యం ఏమీ లేదు' అని వివరణ ఇచ్చారు. రహస్యంగా భేటీ కావాల్సిన అవసరమూ తమకు లేదని స్పష్టం చేశారు. ఈమేరకు ఆదివారం ఓ మీడియా సంస్థతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. రెవెన్యూ మంత్రి వద్ద తాను ఏ ఫైలు కూడా పెట్టలేదని తేల్చిచెప్పారు. నేను పెట్టానని చెబుతున్న ఫైల్ ఏంటో ఆయనే (నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి) చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల అభివృద్ధిపై ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకుంటే తప్పేముందని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. అయితే, పార్టీ అధిష్ఠానానికి చెప్పాల్సింది చాలానే ఉందని వ్యాఖ్యానించారు. త్వరలో పార్టీ రాష్ట్ర ఇన్ చార్జి దీపాదాస్ మున్షిని కలిసి అన్ని విషయాలు మాట్లాడతానని వివరించారు.

**నిధుల కేటాయింపులో అన్యాయం..**

ప్రభుత్వం నిధుల కేటాయింపులో తమకు అన్యాయం చేస్తోందని కొంతమంది ఎమ్మెల్యేలు వాపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రులు ఉన్న నియోజకవర్గాలకే నిధులు వెళుతున్నాయి తప్ప తమ నియోజకవర్గాలకు రావడంలేదని మండిపడుతున్నట్లు సమాచారం. ఇదే విషయంపై ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అప్రమత్తమైన టీపీసీసీ సారథి మహేశ్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఫోన్ చేశారని, అది కేవలం లంచ్ మీటింగ్ మాత్రమేనని అనిరుధ్ రెడ్డి వివరణ ఇచ్చారని పార్టీ వర్గాల సమాచారం.

## జనగామ జిల్లాలో నుజ్జునుజ్జయిన ఆటో.. స్పాట్‌లోనే ఆటోలోని మనిషి ప్రాణం పోయింది..




**హైదరాబాద్ పెన్ పవర్:** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జనగామ జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ పై ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ కొట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో నుజ్జునుజ్జయింది. చనిపోయిన వ్యక్తి సిద్దిపేట జిల్లా దుల్మిట్ట మండలం రెడ్య నాయక్ తండాకు చెందిన విజయ్ నాయక్ గా గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జనగామ జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి.జనవరి 9న కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. డీసీఎం, తుఫాన్ వాహనం ఢీకొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన జిల్లాలోని కొడకండ్ల మండలం గిర్ని తండా దగ్గర జనగామ-సూర్యపేట ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. జనగామ సూర్యాపేట హైవేపై గురువారం ( జనవరి 9, 2025 ) అర్ధరాత్రి డీసీఎం, తుఫాన్ వాహనం ఢీ కొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు స్పాట్ లోనే చనిపోయారు. ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. చనిపోయిన వారు సూర్యాపేట జిల్లా ఈటూరు గ్రామానికి చెందినవారని.. మృతులు పేరాల జ్యోతి,పేరాల వెంకన్న భార్యాభర్తలుగా పోలీసులు గుర్తించారు.

## మేడ్చల్ జిల్లాలో విషాదం.. చేతిలో పల్సర్ బైక్.. ఇక తగ్గేదేలే అని వెళుతుండగా..




**హైదరాబాద్ పెన్ పవర్:**అతి వేగం, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ జిల్లా ముడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన బన్నీ (19),మధు (22), మణిదీప్ (21)లు ముడుచింతలపల్లి గ్రామం నుంచి కేశవరం వైపు పల్సర్ బైక్ పై అతివేగంగా వెళుతున్నారు.ఈ క్రమంలో కేశవరం గ్రామ సమీపంలోని బంగారు గుట్ట మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వల్లపు బన్నీ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మణిదీప్, మధును చికిత్స నిమిత్తం స్థానిక ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి తరలించారు. బాధిత యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గచ్చిబౌలిలో కాల్పుల ఘటన.. దండుపాళ్యం గ్యాంగ్ కంటే డేంజర్‌గా ఉన్నాడుగా..!





**హైదరాబాద్ పెన్ పవర్:** గచ్చిబౌలి ప్రిజం పబ్ దగ్గర జరిగిన కాల్పుల ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని వద్ద నుంచి రెండు తుపాకులు, 23 బులెట్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి గురించి మాదాపూర్ డీసీపీ వినీత్ మీడియాకు వివరాలు వెల్లడించారు. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్‌ను శనివారం సాయంత్రం గచ్చిబౌలి సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారని ఆయన తెలిపారు.

ప్రిజం పబ్ సమీపంలోని ఘటనా స్థలంలో ప్రభాకర్ నుంచి రెండు తుపాకులు, 23 బులెట్స్ స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. బీహార్ నుంచి తుపాకులు కొనుగోలు చేసినట్లు పోలీసులకు విచారణలో ప్రభాకర్ వెల్లడించాడు. ప్రభాకర్ ను సీసీఎస్, ఎస్ఓటీ, డీసీపీ క్రైమ్ పార్టీ నాలుగు బృందాలు విచారించాయి. హైదరాబాద్‌లో ప్రభాకర్ ఉంటున్న రూమ్‌లో మరొక గన్‌తో పాటు 451 బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడు నుంచి చోరీకి ఉపయోగించే పరికరాలు సీజ్ చేశామని, ప్రభాకర్‌పై ఏపీ, తెలంగాణాలో చోరీలకు సంబంధించి మొత్తం 80 కేసు లు నమోదైనట్లు మాదాపూర్ డీసీపీ వెల్లడించారు. నిందితుడు 23 కేసులలో ప్రధాన నిందితుడని, 2022లో జైలు నుంచి పారిపోయాడని, అంతర్ రాష్ట్ర దొంగల ముఠాతో బత్తుల ప్రభాకర్ కు సంబంధాలున్నాయని ఆయన వివరించారు. చోరీలకు మరొక రెండు టార్గెట్స్ పెట్టుకున్నాడని, నిన్న పట్టుకున్న సమయంలో జరగనున్న నేరాన్ని అపడం జరిగిందని పేర్కొన్నారు. సాహసోపేతంగా వ్యవహరించి ప్రభాకర్‌ను పట్టుకున్న సీసీఎస్ పోలీసులను సీపీ అభినందించారు. క్రైమ్స్ విభాగం డీసీపీ నర్సింహా వెల్లడించిన కీలక విషయాలు:


- 2020లో విశాఖపట్నం పరిధిలో అరిలోవా పోలీస్ స్టేషన్ నుంచి ప్రభాకర్ తప్పించుకున్నాడు
- గతంలో తనతో పట్టుబడిన మరొక నిందితుడిపై కోపం పెంచుకొని హత్య చెయ్యాలని పథకం వేసుకున్నాడు
- ప్రస్తుతం మరొక నిందితుడు జైల్లో ఉన్నాడు
- బీహార్‌కు వెళ్లి రెండు సందర్భాల్లో ప్రభాకర్ మూడు గన్‌లు కొన్నాడు
- గన్స్ కొనుగోలులో సహాయం చేసిన వాళ్ళ గురించి విచారణ చేపడుతున్నాం
- దొంగతనాలు చేస్తున్న సమయంలో తుపాకులతో బెదిరించి తప్పించుకోవాలని ప్లాన్ చేసుకున్నాడు
- ఆ సమయంలో ఎవరైనా అడ్డు వస్తే చంపడానికి కూడా ప్రభాకర్ వెనుకాడడు
- 8 నెలల నుంచి తుపాకులను పట్టుకుని తిరుగుతున్నాడు
- ప్రభాకర్ 23 కేసులలో ప్రధాన నిందితుడు
- 21 కేసులు గతంలో, నిన్న (శనివారం, ఫిబ్రవరి 1, 2025) రెండు కేసులు పెట్టడం జరిగింది
- 2013 నుంచి దొంగతనాలు చేస్తున్నాడు.. ప్రభాకర్ రెక్కీ చేసి దొంగతనాలు చేస్తున్నాడు
- గచ్చిబౌలి పరిధిలోని అపార్ట్ మెంట్ ఫ్లాట్ మిత్రుడి పేరు మీద తీసుకొని అక్కడ ఉంటున్నాడు
- దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బులతో విలాసవంతంగా జీవితాన్ని గడపడం నిందితుడికి అలవాటు
- ప్రభాకర్ జరిపిన కాల్పుల్లో గాయపడ్డ హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది
- రెండు నెలల్లో కోలుకోనున్నట్లు డాక్టర్లు తెలిపారు

# చదువుల తల్లి పండుగ..సరస్వతి దేవి అనుగ్రహం పొందాలంటే ఏం చేయాలి..



**హైదరాబాద్ పెన్ పవర్:** మాఘమాసం కొనసాగుతుంది. చదువుల తల్లి .. సరస్వతిదేవి పుట్టిన రోజు మాఘమాసం శుద్ద పంచమి. దీనినే వసంత పంచమి.. శ్రీ పంచమి అంటారు. క్రోధినామ సంవత్సరంలో ఫిబ్రవరి 3 వ తేదీన దేశ వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. పండితులు.. సిద్దాంతులు తెలిసిన వివరాల ప్రకారంచదువుకునే పిల్లలు ఈ రోజున ( ఫిబ్రవరి 3) కొన్ని ప్రత్యేక నియమాలు పాటిస్తే చదువులో రాణిస్తారని చెబుతున్నారు. వసంత పంచమి రోజు పిల్లలు ఎలాంటి నియమాలు పాటించాలో తెలుసుకుందాం. . .చదువుకునే పిల్లలకు వసంత పంచమి చాలా ప్రత్యేకమైన రోజు. ఆ రోజు ( ఫిబ్రవరి 3) చదవుల తల్లి.. సరస్వతి దేవిని పూజించడం వలన విద్యార్థులు విద్యలో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. ఞానాన్ని సంపాదించడమే కాకుండా.. కొత్త ఆలోచనలు రావడం.. పాఠశాలలో... పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారు. వసంత పంచమి రోజున చిన్న పిల్లలు తమ విద్యా జీవితం ప్రారంభిస్తారు. అంటే ముహూర్తంతో సంబంధం లేకుండా అక్షరాభ్యాసం చేస్తారు. అందుకే ఈ ఏడాది ఫిబ్రవరి 3న సరస్వతి దేవాలయాలు కిటకిటలాడుతాయి. వసంతపంచమి ( ఫిబ్రవరి 3) రోజున విద్యార్థులు సరస్వతి దేవిని పూజించాలి. అవకాశం ఉన్నవారు.. ఉండగలిగిన వారు ఉపవాస దీక్షను పాటిస్తే మంచిదని పండితులు చెబుతున్నారు. ముందుగా బ్రహ్మ ముహూర్తంలో లేచి కాలకృత్యాలు తీర్చుకొని.. పూజా మందిరంలో సరస్వతి దేవి విగ్రహాన్ని కాని.. చిత్ర పటాన్ని కాని ఉంచాలి. ఆ తరువాత షోడశోపచారాల పూజలు చేసి.. సరస్వతి అష్టోత్తరం తో అమ్మవారిని పూజించి ధూపం.. దీపం.. దీపం .. నైవేద్యం సమర్పించాలరు. ఇలా చేస్తే పిల్లలకు విద్యా పరంగా ఎంతో శుభప్రదమని చెబుతున్నారు. అలా చేస్తే.. వారి జ్ఞానాభివృద్ధి సులభం అవుతుంది. పాఠశాలల్లో.. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ లో మంచి ఫలితాలు పొంది.. జీవితంలో విజయం సాధించడం ఖాయమని పండితులు చెబుతున్నారు. సరస్వతి దేవత జ్ఞానం, కళ, సంగీతం, విద్య.. విజ్ఞానానికి అదిష్ఠాన దేవత. ఆమె పుట్టిన రోజున అనగా వసంత పంచమి రోజున ఈ దేవతను ప్రత్యేకతంగా పూజలు చేస్తారు. అలా చేయడం వలన విద్యార్థులకు చదువులో ఉన్న ఆటంకాలు తొలగిపోతాయని పండితులు చెబుతున్నారు. విద్యార్థులకు మంచిగా చదివేందుకు ప్రేరణ ఇవ్వడానికి సరస్వతి దేవతను పూజించడం ద్వారా వారు నూతన ఆశలు, శక్తిని పొందుతారు. ఈ రోజున( ఫిబ్రవరి 3) సరస్వతి దేవిని పూజించి ...ఉపవాసం ఉండడం వల్ల విద్యార్థుల జీవితాల్లో ఆనందం, విజయం, ఆధ్యాత్మిక శ్రేయస్సు ఉంటుందని జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారు

## కుంభమేళాలో కోల్డ్ ప్లే సింగర్... ఈవెంట్ కోసం కాదు పుణ్య స్నానం కోసమే...




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఆదివారం ఓ ప్రత్యేక అతిథి హాజరయ్యారు. కోల్డ్ ప్లే కాన్సర్ట్ లలో తన పాటలతో యూత్ ను ఉర్రూతలూగిస్తున్న సింగర్ క్రిస్ మార్టిన్ శనివారం కుంభమేళాలో పాల్గొన్నారు.

తన స్నేహితురాలు డకోటా జాన్సన్ తో కలిసి మహాకుంభ్ నగర్ కు చేరుకున్న క్రిస్ మార్టిన్... త్రివేణి సంగమంలో పుణ్య స్నానం చేశారు. ఈ జంట పుణ్య స్నానం చేస్తూ మహా శివుడికి నమస్కరిస్తున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడంపై క్రిస్ మార్టిన్ సంతోషం వ్యక్తం చేశారు.

కాగా, ఇటీవల దేశంలోని వివిధ నగరాలలో కోల్డ్ ప్లే సంగీత కచేరీలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాలతో క్రిస్ మార్టిన్ బాగా పాప్యులర్ అయ్యారు. ముంబై, గుజరాత్ లలో జరిగిన షోలకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలోనే క్రిస్ మార్టిన్, డకోటా జాన్సన్ కుంభమేళాలో పాల్గొని పుణ్య స్నానం చేశారు.

# భర్త కిడ్నీ రూ.10 లక్షలకు అమ్మేసి ప్రియుడితో లేచిపోయింది!

- ప్రియుడి మోజులో దారుణం
- భర్తను నమ్మించి వంచించిన మహిళ
- కుమార్తె చదువు కోసం అంటూ భర్తతో కిడ్నీ అమ్మించిన వైనం
- కిడ్నీ విక్రయంతో వచ్చిన డబ్బుతో ప్రియుడితో పరార్



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రియుడి మోజులో పడి ఓ మహిళ ఎంతటి దారుణానికి పాల్పడిందో చూడండి. దారుణం అనడం కంటే కట్టుకున్న భర్త పట్ల నయవంచనకు పాల్పడిందంటేనే సమంజసంగా ఉంటుందేమో! కుమార్తె చదువు కోసం అని చెప్పి భర్త కిడ్నీని రూ.10 లక్షలకు అమ్మేసిన ఆ మహిళ... రాత్రికి రాత్రే ప్రియుడితో పరారైంది. ఈ ఘటన పశ్చిమ బెంగాల్ లో జరిగింది. హౌరా జిల్లాలోని సంక్రైల్ లో సదరు మహిళ తన కుటుంబంతో నివసిస్తోంది. అయితే, పేదరికం కారణంగా వారు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, సదరు మహిళ పెయింటర్ గా పనిచేసే మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఆమె ప్రియుడు బారక్ పూర్ ప్రాంతానికి చెందినవాడు. ఇద్దరికీ ఫేస్ బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా అక్రమ సంబంధానికి దారితీసింది. ఇక, ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రియుడితో సుఖంగా గడపడానికి ఆమె తిరుగులేని ప్లాన్ వేసింది. కుమార్తెను చదివించాలి, పెళ్లి చేయాలి... అందుకు డబ్బు కావాలి... నీ కిడ్నీ అమ్మేద్దాం అని భర్తను ఒప్పించింది. భార్య అదే పనిగా ఒత్తిడి చేస్తుండడంతో ఆ భర్త సరేనన్నాడు. ఓ ఏడాది తర్వాత కిడ్నీ కొనడానికి ఓ వ్యక్తి దొరికాడు. తాను ఇచ్చే డబ్బుతో ఆ కుటుంబం బాగుపడుతుందని నమ్మిన ఆ వ్యక్తి కిడ్నీ కొనుగోలు చేశాడు. కానీ ఆ మహిళ అందరినీ మోసం చేసి... కిడ్నీ అమ్మగా వచ్చిన రూ.10 లక్షల డబ్బు తీసుకుని ప్రియుడితో కలిసి పరారైంది. దాంతో దిగ్భ్రాంతికి గురైన ఆ భర్త... పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె, తన పెయింటర్ ప్రియుడితో కలిసి బారక్ పూర్ లో ఉంటోందని గుర్తించిన భర్త... 10 ఏళ్ల కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అయితే, భర్త, కుమార్తె వచ్చినా... ఆ మహిళ తలుపు తీయలేదు. విడాకులు ఇచ్చేస్తాను... వెళ్లిపో అంటూ కేకలు వేసింది. అత్తమామలు కూడా వచ్చి బతిమాలినా ఆ మహిళ ఇంట్లోంచి బయటికే రాలేదు.

# అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య




**హైదరాబాద్ పెన్ పవర్:**అత్తింటి వేధింపులను తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ లో చోటు చేసుకుంది. రవళి అనే వివాహిత.. అత్తింటి వేధింపులతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రవళి( 25)కి మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి తో 2019లో వివాహం జరిగింది..పెళ్లయిన మూడు నెలల నుండే భర్త, అత్త, మామ, ఆడబిడ్డ వేధింపులు రవళికి ఎక్కువయ్యాయి. ఆ తర్వాత వీరు హైదరాబాద్ వచ్చి ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి సాత్విక (5) పునర్విక (3) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ తరువాత ఉప్పల్ లోని చిలుక నగర్ లో నివాసముంటున్నారు. ఏడాది క్రితం భార్య.. పిల్లలను వదిలేసి రాజశేఖరరెడ్డి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో పిల్లలకు ఆధార్ కార్డు కూడా లేని పరిస్థితిలో ఉన్నారు. సంవత్సరం క్రితం చిలుకనగర్ లోనే భార్య ఇద్దరు పిల్లలను వదిలేసి రాజశేఖర్ రెడ్డి వెళ్ళిపోయాడు..బీటెక్ చదివిన రవళి చిలక నగర్ లోని స్కూల్లో టీచర్ గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తుంది...భర్త వదిలేసి వెళ్లిపోవడం... పిల్లలకు ఆధార్ కార్డు లేకపోవడంతో .. స్కూల్లో పిల్లలకు అడ్మిషన్ లభించకపోవడంతో.. భర్త ఆచూకి తెలుసుకుని పిల్లలను భర్త వద్ద వదిలేసింది. దీంతో భర్త కుటుంబం నుంచి రవళికి వేధింపులు ఎక్కువ అయ్యాయి.

శనివారం ( ఫిబ్రవరి 1) హైదరాబాద్ లో ఓ ఫంక్షన్ కు వచ్చిన రవళి అత్త.. మామ.. రాజశేఖర్ భార్య రవళి ఇంటికి వెళ్లారు. ఆ రాత్రే ఆమె చనిపోవడంతో పలు అనుమానాలకు దారితీసింది. రవళిని ఆమె భర్త, అత్త, మామ వేధించడం వల్లే శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని బంధువులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టానికి గాంధీ ఆస్పత్రికి తరలించారు. రవళి డెడ్ బాడీని చూడటానికి భర్త, అత్త, మామ, ఆడబిడ్డ లు రాలేదు..

రవళి కుటుంబసభ్యులు.. బంధువులు భర్త.. అత్త.. మామ.. ఆడబిడ్డ వల్లే చనిపోయిందని ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని పిలిచినా ఇంతవరకు విచారణకు హాజరుకాలేదు. రవళి మరణాన్ని కారణమైన భర్త, అత్త మామ ఆడబిడ్డ పై చర్యలు చేపట్టాలని మృతురాలి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

## తిరుపతిలో బయటపడ్డ పురాతన విగ్రహం.. స్వామి వారి పాదాలు చూడండి..



**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుపతి: శ్రీవారు స్నానం చేసిన నామాల కాలవ దగ్గర పురాతన విగ్రహం బయటపడింది. రామచంద్రాపురం మండలం నడవలూరు నెన్నూరు పంచాయతీల మధ్య ఉన్న శ్రీవారు స్నానం చేసిన నామాలు ధరించిన కాలవ దగ్గర ఉన్న పొలంలో పురాతన విగ్రహం బయటపడింది. ఈ విగ్రహం పైన స్వామి వారి పాదాలు స్పష్టంగా కనబడుతున్నాయి.కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరుడు పద్మావతి అమ్మవారిని పెళ్లి చేసుకున్న తర్వాత సతీసమేతంగా తిరుమలకు బయల్దేరతారు. ఈ క్రమంలో రామచంద్రాపురం మండలం నెన్నూరు పంచాయతీ కొత్త నెన్నూరు దగ్గర ఉన్న కాలువలో స్నానం చేసి నామాలు పెట్టుకున్నట్లు తిరుమల చరిత్ర చెబుతుంది. అందుకనే ఈ కాలువను నాం కాలువగా, నామాల కాలువ అని పిలుస్తుంటారు. మౌని అమావాస్య రోజున ఈ కాలువలో భక్తులు భక్తి ప్రపత్తులతో పవిత్ర స్నానాలు ఆచరించారు. అంతటి ప్రాశస్త్యం ఉన్న కాలువ దగ్గరలో పురాతన విగ్రహం బయటపడటం, ఆ విగ్రహంపై స్వామి వారి పాదాలు కనిపించడంతో భక్తులు ఆ పాదాలను దర్శించుకునేందుకు తరలివస్తున్నారు.

## నల్గొండలో ఏకంగా సీఐనే బ్లాక్ మెయిల్ చేసిన నకిలీ విలేకర్ల ముఠా




**హైదరాబాద్ పెన్ పవర్:**నల్గొండ జిల్లాలో నకిలీ విలేకర్ల ముఠా ఒకటి పోలీసులను టార్గెట్ చేసింది. అక్రమాలు బయటపెడతామంటూ బెదిరింపులకు పాల్పడుతోంది. వీరి డిమాండ్లకు ఓ సీఐ తలొగ్గడం గమనార్హం. రూ.5 లక్షలు ఇవ్వాలని సదరు ముఠా డిమాండ్ చేయగా.. వారి ఆగడాలు తట్టుకోలేక సీఐ తన మిత్రుడి ద్వారా రూ 1.10 లక్షలు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఆ ముఠా బెదిరింపులు ఆగలేదు. తాము డిమాండ్ చేసిన సొమ్ములో మిగతా రూ.4 లక్షలు ఇవ్వాలంటూ వేధించడం ప్రారంభించింది. ఈ ముఠా ఆగడాలు భరించలేక సదరు సీఐ తన శాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆ ముఠాలోని ఒక నకిలీ విలేకరిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# మాఘ మాసం.. పండుగల మాసం... ఫిబ్రవరిలో ఏఏ పండుగలున్నాయంటే..

**హైదరాబాద్ పెన్ పవర్:**మాఘమాసం తెలుగు క్యాలండర్‌లో 11 వ నెల. హిందువులకు.. ఆధ్యాత్మికంగా కార్తీకమాసం ఎంత ముఖ్యమో.. మాఘ మాసానికి కూడా అంతటి ప్రాముఖ్యత ఉంది. మాఘమాసంలో ...ఈ ఏడాది ( 2025) ఫిబ్రవరి 3వ తేదీన వసంత పంచమి తిథి రోజున సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగో తేదీన రథ సప్తమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. మాఘమాసంలో వచ్చే పండుగలు.. పర్వదినాల.. వాటి విశిష్టత గురించి తెలుసుకుందాం. . .మాఘమాసం.. ఫిబ్రవరి 2025 లో వసంత పంచమి.. రథసప్తమి మాఘ పూర్ణిమ, మహా శివరాత్రి, మహా కుంభమేళా ముగింపు వంటి ప్రధాన పండుగలు కూడా రానున్నాయి. ఈ పవిత్రమైన రోజులన్నీ ఉపవాసానికి ఎంతో ముఖ్యమైనవి. వీటితో పాటు మాఘమాసంలో పుణ్య స్నానం ప్రధానమైన ఆచారం. పుణ్య నదుల్లో ( గోదావరి, కృష్ణ, తుంగభద్ర మొదలైనవి) స్నానాలు ఆచరిస్తారు. వెళ్లేందుకు అవకాశం లేని వారు పొద్దున్నే ఇంటి దగ్గర మోటారు దగ్గర కాని, బావి దగ్గర గాని కుళాయి దగ్గర కాని స్నానం చేయవచ్చు.

**వసంత పంచమి.. ( ఫిబ్రవరి 3) :** మాఘశుద్ధ పంచమిని శ్రీపంచమి అంటారు. సరస్వతీదేవి పుట్టిన రోజని పురాణాల్లో ఉందని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. ఈ పవిత్రమైన రోజున సరస్వతీ దేవికి పూజ చేస్తే విశేష ఫలితం కలుగుతుంది. జగత్తంతా నడవడానికి బుద్ధి ముఖ్యం. ఆ బుద్ధి సక్రమంగా పనిచెయ్యడానికి సరస్వతీదేవి అనుగ్రహం ముఖ్యం కాబట్టి, ఆనాడు సరస్వతీ ఉపాసన చెయ్యాలని పండితులు చెబుతున్నారు. . అంతేకాదు మహాకుంభమేళాలో నాలుగో రాజస్నాన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

**రథ సప్తమి..(ఫిబ్రవరి 4):** ఈ పవిత్రమైన రోజున సూర్య దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని అరసవల్లి, ఒడిశాలోని కోణార్క్, గుజరాత్ రాష్ట్రంలోని సూర్య దేవాలయాల్లో రథ సప్తమి రోజున వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. అదితి, కశ్యపుల పుత్రుడైన సూర్యుడు లోకాలకు వెలుగు నివ్వడం కోసం ... రథ సప్తమి రోజున రథమెక్కి ఆకాశంలో సంచారానికి బయలు దేరాడని పురాణాలు చెబుతున్నాయి. రథసప్తమి నాడు రేగుపళ్ళు, జిల్లేడు ఆకులు నెత్తిమీద పెట్టుకుని నదీ స్నానం చేయాలని



ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు.

**శ్లోకం**

**సప్తే సప్తే త్రిమూర్త్యాత్మన్ సప్తాశ్వరథవాహన!**
**సప్తజన్మకృతం పాపం స్నానేనైవ వినాశయ.!!**

రథసప్తమీ నదీస్నానం చేయడం ఉత్తమం. పై శ్లోకమును చదువుచూ నదీ స్నానం చెయ్యాలి. ఇంటికి వెళ్ళి అవుపాలతో పాలపొంగలి చేసి సూర్యునికి 12 చిక్కుడాకులలో పెట్టి నివేదన చెయ్యాలి. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అని ఆరోగ్యమును కోరేవారు సూర్యుని ఆరాధించాలి.సూర్య భగవానుడు ... బ్రహ్మ ..విష్ణు ..మహేశ్వర స్వరూపుడని... వేదాలు ప్రశంసించాయి. ఋగ్వేదంలోని మహాసౌరమంత్రాలు, యజుర్వేదంలోని అరుణకేతుకం అనే అరుణ ప్రశ్నశాస్త్రంలో సూర్య దేవుని మహిమ అనేక విధాలుగా ఉందని ప్రశ్నా శాస్త్ర నిపుణులు చెబుతున్నారు

**భీష్మ ఏకాదశి( ఫిబ్రవరి 8):** మాఘ మాసంలోని శుక్ల పక్షంలో వచ్చే ఏకాదశిని జయ ఏకాదశి లేదా భీష్మ ఏకాదశి అని అంటారు. ఈ ఏకాదశి రోజున ఉపవాసం ఉండటం వల్ల అన్ని పనుల్లో విజయం సాధించడమే కాకుండా, శుభ ఫలితాలను పొందుతారు. ఈ పవిత్రమైన రోజున శ్రీ మహా విష్ణువుకు ప్రత్యేక పూజలు నిర్వహించాలి. ఇలా చేయడం వల్ల కచ్చితంగా మోక్షం లభిస్తుందని చాలా మంది నమ్ముతారు. కోరుకున్న సమయంలో తనువు చాలించగలిగే వరం ఉన్న భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చేవరకూ వేచి ఉండి.. ఉత్తరాయణం ప్రవేశించిన తర్వాత మరణించాడు. అందుకే మాఘస్నానానంతరం భీష్మునికి తర్పణం చెయ్యాలి. తిలలతో తర్పణం చేయాలి.

**శ్లోకం:**

వైయాఘ్రపాదగోత్రాయ సాంకృతి ప్రవరాయచ,
గంగాపుత్రాయ భీష్మాయ, ప్రదాస్యేహం తిలోదకమ్,
అపుత్రాయ దదామ్యేత జం భీష్మాయ వర్మణే ll

అనే శ్లోకం మూడుసార్లు చదివి మూడు సార్లు తిలతర్పణం చేయాలి.

**మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12 ) :** ప్రతి నెల పౌర్ణమి తిథి వస్తుంది. కాని మాఘ మాసంలో వచ్చే పౌర్ణమికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ పవిత్రమైన రోజున పుణ్య నదులలో స్నానం చేస్తారు. ఈ పర్వదినాన దేవతలు భూమిపైకి ప్రవహించే నీటిలో స్నానం చేస్తారని చాలా మంది నమ్ముతారు. కుంభ మేళాలో ఐదో రాజస్నాన వేడుకలను జరుపుకుంటారు.ఈ రోజు చేసే దానధర్మాలు రెట్టింపు ఫలితాలన్నిస్తాయి .

**విజయ ఏకాదశి( ఫిబ్రవరి 24)..** మాఘమాసం కృష్ణ పక్షంలో వచ్చే ఏకాదశిని సర్వ ఏకాదశి లేదా విజయ ఏకాదశి అంటారు. ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి తులసి దళాలతో లక్ష్మీ నారాయణులను పూజిస్తే సర్వ పాపాల నుంచి విముక్తి లభిస్తుందని పండితులు చెబుతున్నారు. ఓం నమో భగవతే వాసుదేవాయ నమ: అనే మంత్రాన్ని వీలైనన్ని ఎక్కువ పర్యాయములు అనుష్ఠానం చేయాలి. ఈరోజున మీశక్తి మేరకు దాన.. ధర్మాలు చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని శ్రీకృష్ణుడు చెప్పాడని పురాణాల్లో రుషులు వివరించారు.

**మహా శివరాత్రి ( ఫిబ్రవరి 26) :** ప్రతి నెలా అమావాస్య ముందు వచ్చే చతుర్దశి మాసశివరాత్రి అంటారు. ఈ మాఘమాసంలో అమావాస్య ముందు వచ్చే చతుర్దశిని మహాశివరాత్రి అంటారు. మాఘమాసంలో అర్ధరాత్రి పన్నెండు గంటలకు చతుర్దశి ఏ రోజున ఉంటుందో దానినే మహాశిరాత్రి అంటారు. ఇది శివునికి ప్రీతికరమైన తిథి.

మహాశివరాత్రి రోజున ఉదయమే సంకల్ప సహితంగా స్నానంచేసి, శుచిగా శివాలయానికి వెళ్ళి గాని, ఇంట్లో లింగం పెట్టికాని, లేదా దేవతార్చన ఉన్నవారు సాలగ్రామాలకు గానీ అభిషేకాలు, పూజలు (బిల్వదళాలతో) చేస్తారు. కొందరు సహస్రలింగార్చన–మహాలింగార్చన చేస్తారు. పగలంతా ఉపవాసం చేసి, రాత్రి శివపురాణాలు కథలూ చదువుతూ జాగరణం చేస్తారు. కొందరు పాలు, పెరుగు, తేనె, ఆవునెయ్యి పంచదార, చెరకురసం, గంధోదకం, పుష్పోదకాలు మొదలైన ద్రవ్యాలతో అర్ధరాత్రి లింగోద్భవ కాలానికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తూ జాగరణం చేస్తారు. ఈసారి మహా శివరాత్రి రోజున మహాకుంభమేళాలో రాజస్నానాలు ఆచరిస్తారు. అంతేకాదు ఈ పవిత్రమైన రోజుతో మహాకుంభమేళా వేడుకలు ముగుస్తాయి. ఈరోజున శివ భక్తులకు ఎంతో ప్రత్యేకమైనది. ఈ పర్వదినాన ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండటంతో పాటు కచ్చితంగా జాగరణ నిర్వహిస్తారు. ఇలా చేయడం వల్ల తమకు ఎంతో పుణ్యం లభిస్తుందని నమ్ముతారు.


**బహుళ అమావాస్య( ఫిబ్రవరి 28) :** హిందూ పంచాంగం ప్రకారం, అమావాస్య తిథికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ పవిత్రమైన రోజున శివుడిని పూజించడం వల్ల, తమ జాతకంలో చంద్రుని స్థానం బలపడుతుందని చాలా మంది నమ్ముతారు. ఈరోజున పవిత్రమైన నదుల్లో చేసే స్నానాలకు, దేవాలయాల్లో పూజలకు, దానాలకు, ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. వివాహిత స్త్రీలు తమ భర్త, పిల్లల క్షేమం కోసం ఉపవాసం ఉంటారు.

# పెళ్లి వేదికపై వరుడి డ్యాన్స్.. చిరాకేసి పెళ్లి రద్దు చేసిన వధువు తండ్రి

- **ఛోళీ కే పీఛే పాటకు డ్యాన్స్ చేసి పరువు తీశాడని మండిపాటు**
- **సరదాగా చేశానని నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోని వైనం**
- **తండ్రి నిర్ణయంతో కన్నీళ్లతో వేదిక పైనుంచి దిగిపోయిన వధువు.. ఢిల్లీలో ఘటన**

**హైదరాబాద్ పెన్ పవర్:**పెళ్లిలో బంధుమిత్రులు సరదాగా డ్యాన్స్ చేయడం మా మూలే.. హుషారైన పాట వినిపిస్తే డ్యాన్స్ రానివాళ్లు కూడా తోచినట్టు కాలు కదుపుతారు. కాబోయే వధూవరులతోనూ డ్యాన్స్ చేయించాలని స్నేహితులు ప్రయత్నిస్తుంటారు. ఢిల్లీలోని ఓ వివాహ వేడుకలోనూ ఇలాగే స్నేహితులు పిలవడంతో పెళ్లికొడుకు వారితో పాటు స్టెప్పులేశాడు. బాలీవుడ్ లో ఒకప్పుడు ఉర్రూతలూగించిన 'ఛోళీకే పీఛే క్యాహై..' పాటకు పెళ్లికొడుకు డ్యాన్స్ చేయడం చూసి అతిథులు నవ్వుకున్నారు. సరదాగా సాగిన ఈ సన్నివేశం వధువు తండ్రికి మాత్రం చిరాకు తెప్పించింది.

'ఛీ ఛీ.. ఆ పాటేంటి, నీ డ్యాన్స్ ఏంటి' అని మండిపడుతూ పెళ్లిని రద్దు చేశాడు. ఇలాంటి పాటకు రోడ్డు మీద తైతక్కలాడే వ్యక్తికి తన కూతురును ఇచ్చి పెళ్లి చేయలేనని తేల్చిచెప్పాడు. ఆ తర్వాత ఎవరు ఎంతగా సర్దిచెప్పాలని చూసినా ఆయన వినిపించుకోలేదు. తండ్రి నిర్ణయంతో చేసేదేంలేక వధువు కన్నీళ్లతో వేదిక దిగిపోయింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు.ఈ సంఘటనకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ ను షేర్ చేస్తూ.. వధువు తండ్రి చేసింది కరెక్టే, పెళ్లి రద్దు చేయకుంటే రోజూ ఆ డ్యాన్స్ చూడాల్సి వచ్చేదని కొందరు, ఇది అరేంజ్ డ్ మ్యారేజ్ కాదు, ఎలిమినేషన్ రౌండ్ జరుగుతోందని మరొకరు కామెంట్ చేశారు. ఇంకొకరు మాత్రం



పెళ్లికొడుకును సమర్థిస్తూ.. ఛోళీకే పీఛే సాంగ్ కు ఉన్న ఊపు అలాంటింది, ఆ పాట ప్లే చేస్తుంటే ఎవరైనా సరే డ్యాన్స్ చేయాల్సిందే. నా పెళ్లిలో ఆ పాట పెడితే నేను కూడా డ్యాన్స్ చేస్తానని కామెంట్ చేశారు.